క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా రాచమల్లు రవిశంకర్ రెడ్డి



కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా మైదుకూరు నియోజకవర్గానికి చెందిన రాచమల్లు రవిశంకర్‌రెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రాచమల్లు రవిశంకర్‌రెడ్డి ఇదివరకు వైఎస్సార్‌సీపీ స్టేట్ స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా, చిత్తూరు, గుంటూరు జిల్లాల యూత్ కో ఆర్డినేటర్‌గా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా, వైఎస్సార్ సేవాదళ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సేవలందించారు. ఇప్పుడు మళ్లీ ఆయన్ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించి పదవి ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



షేక్ అబ్దుల్ (ఫైల్)

కడప అర్బన్: కడప నగరంలోని రిమ్స్ పిఎస్ పరిధిలో షేక్ అబ్దుల్ (35) అనే వ్యక్తి జనవరి 17వ తేదీన తన ఇంటి నుంచి పెయింట్ పనికి వెళ్లి తిరిగిరాలేదు. అతని ఫోన్ స్విచాఫ్ వస్తోందనీ, అన్ని చోట్ల వెతికామనీ అతని భార్య షేక్ మాబున్నీసా గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలియజేశారు.

ఆత్మహత్యలను నివారించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నారాయణ సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలను నివారించేందుకు కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీర పోగు రవి అన్నారు. గురువారం నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల్లో యాజమాన్యం ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇటీవల విశాఖపట్నం మధురవాడ బ్రాంచ్‌లో, అనంతపురం జిల్లాలో ఇలాంటి ఘటనలు జరిగాయన్నారు.

బ్రహ్మోత్సవ వైభవం



అమ్మవారి రథాన్ని లాగుతున్న భక్తులు



కోలాట ప్రదర్శనలో కళాకారులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మూడవరోజు గురువారం స్వామికి చండీహోమం, శ్రీ చక్రార్చన, ఇతర పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ యాగ శాలలో చండీహోమం, శ్రీచక్ర మండపంలో నవావరణ శ్రీచక్రార్చనలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు శ్రీ విజయ దుర్గా మల్లికార్జునులకు ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయం బ్రహ్మోత్సవాల ప్రత్యేక దర్శనాల కోసం విచ్చేసిన భక్తులతో ఉదయం నుంచి సందడిగా మారింది. స్థానిక బృందాలతోపాటు సమీప గ్రామాల నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన కోలాటం బృందాలు అమ్మవారి సన్నిధిలో నృత్యాలు చేసి తమ భక్తిని చాటుకున్నారు.

నేడు కల్యాణం

మాఘ బహుళ విదియ జగన్మాత శ్రీ విజయ దుర్గా దేవి కడప లో కొలువు తీరిన పర్వదిన సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, సాయంత్రం 4 గంటలకు కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. రాత్రి నగరోత్సవం నిర్వహిస్తారు.

భక్తిశ్రద్ధలతో షబ్ ఏ బరాత్



మస్జిద్ ఏ నకాష్‌లో ప్రసంగిస్తున్న గురువు హజరత్ మహమ్మద్ అలీ బాగ్దాది సాహెబ్

కడప కల్చరల్ : ముస్లింలు గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో షబ్ ఏ బరాత్ (పెద్దరాత్రి) ను జరుపుకున్నారు. మస్జిద్ లలో ప్రత్యేక నమాజులు, ప్రార్థనలు చేశారు. నాత్ గీతాలతో మహమ్మద్ ప్రవక్త గుణగణాలను స్మరించుకున్నారు. మహమ్మద్ ప్రవక్త సూచించిన బాటలో నడవాలని మత గురువులు ప్రసంగాలు చేశారు. అలాగే ప్రపంచ శాంతి కోసం ప్రార్థించారు. అందరికీ మంచి ఆరోగ్యం ప్రసాదించాలని అల్లాహ్‌ను వేడుకున్నారు. అలాగే పెద్ద రాత్రి సందర్భంగా ఖబరస్తాన్ లకు వెళ్లి గతించిన పెద్దల సమాధులపై పూలు చల్లి స్మరించుకున్నారు.

కెనరా బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి



ఆటో ర్యాలీకి జెండా ఊపుతున్న కెనరా బ్యాంకు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు ప్రజల అవసరాలు తీరేలా అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు రీజినల్ హెడ్ మురళీమోహన్ పిలుపునిచ్చారు. గురువారం డోర్ టు డోర్ క్యాంపెయిన్‌లో భాగంగా ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ హెడ్ మాట్లాడుతూ తమ బ్యాంకు ఫిక్సెడ్ డిపాజిట్లపై అధిక వడ్డీని అందించడం జరుగుతోందన్నారు. అలాగే ఏంజిల్స్ సేవింగ్ అకౌంట్స్ (మహిళలకు ప్రత్యేకంగా రూపొందించిన)ను తెరవడం వల్ల క్యాన్సర్ కేర్ ట్రీట్‌మెంట్ ఫ్రీగా అందిస్తామన్నారు. ఇవే కాకుండా కెనరా బ్యాంకు అందిస్తున్న వివిధ స్కీమ్‌లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం ఆకే రాథోర్, డీఎం అరుణజ్యోతి, గౌరీశంకర్, రీజినల్ ఆఫీసు ఎగ్జిక్యూటివ్స్ రమేష్; షఫీఖ్ అహ్మద్, విలియమ్ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జామ్‌మేళా

కడప ఎడ్యుకేషన్: కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల)లో గురువారం జరిగిన జాబ్ మేళాకు విద్యార్థుల నుంచి స్పందన లభించింది. ఈ మేళాలో 4 కంపెనీలు పాల్గొన్నాయని కళాశాల ప్రధానాచార్యులు డా. ఎ.రవీంద్రనాథ్ తెలిపారు. కడప ప్రభుత్వ పురుషుల కళాశాలతోపాటు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు 74 మంది జాబ్‌మేళాలో పాల్గొనగా రాత పరీక్ష, మౌఖిక పరీక్ష నిర్వహించి 34 మంది విద్యార్థులను వివిధ కంపెనీలకు ఎంపిక చేసుకున్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని ఈ సందర్భంగా అభినందించారు.

సరోజినీ నాయుడును ఆదర్శంగా తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ప్రతి విద్యార్థిని సరోజినీ నాయుడును ఆదర్శంగా తీసుకోవాలని జనం కోసం సేవ సాంస్కృతిక విద్యా క్రీడ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఖాదర్‌బాషా అన్నారు. గురువారం కడప జయనగర్ కాలనీ జెడ్పీ హైస్కూల్‌లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజిని నాయుడు జయంతి ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్వీ రమణారెడ్డి అధ్యక్షతన సరోజినీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాయల్ కరీం సేవా సంస్థ అధినేత అబ్దుల్ రాయల్ కరిముల్లా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సమాజాన్ని ఆదుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలోని కూటమి సర్కార్ క్రైస్తవ సమాజానికి తోడ్పాటు అందించి ఆదుకోవాలని నగర క్రైస్తవ ప్రముఖులు వైపీ డేవిడ్ కోరారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా చర్చిలు, పాస్టర్లకు ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదన్నారు. నాటి జగన్ సర్కార్ హయాంలో లాక్‌డౌన్ కారణంగా దేవాలయాలు, చర్చిలు, మసీదులతో పాటు మతపరమైన కార్యకలాపాలు నిలిచిపోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్చకులు, పాస్టర్లు, ఇమామ్‌లు, మౌజన్లను ఆదుకున్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఈ విషయంగా సత్వరమే స్పందించాలని ఆయన కోరారు.

భార్యను కడతేర్చిన భర్త

కడప అర్బన్: కడప టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బెల్లం మండివీధిలో గురువారం అర్ధరాత్రి భార్యాభర్తలు గొడవపడ్డారు. ఈ గొడవలో తన భార్య జమీల భాను(32) తలపై సుత్తితో మోది హత్య చేశాడు ఇమ్రాన్. వీరికి ముగ్గురు సంతానం. భార్యాభర్తల మధ్య మనస్పర్థలే హత్యకు కారణమని ప్రాథమికంగా పోలీసుల విచారణలో తేలింది. కడప టూ టౌన్ సీఐ బి నాగార్జున, ఎస్సై ఎస్కేఎం హుస్సేన్ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు.